క్లుప్తంగా

నాగార్పమ్మకు పొంగళ్లు


అలంకారంలో నాగార్పమ్మ

ఓజిలి: మండల కేంద్రమైన ఓజిలి గ్రామదేవత నాగార్పమ్మకు శుక్రవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. వారు మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి పూజలు చేసి, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పొంగళ్లు పెట్టి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

జలజీవన్, హౌసింగ్ పనులపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీవో

సైదాపురం: మండలంలోని అనంతమడుగు, ఊటుకూరు, సైదాపురం గ్రామ పంచాయతీల్లో చేపట్టిన జలజీవన్ మిషన్, పీఎంఏజీవై హౌసింగ్ పనుల పురోగతిపై శుక్రవారం గ్రాడ్యుయేట్స్‌కి మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ రీసెర్చ్ స్కాలర్స్ పాపయ్య ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభించారు. ఎంపీడీవో శివకుమార్ మాట్లాడుతూ మూడు పంచాయతీల్లో చేస్తున్న అభివృద్ధి పనులపై రెండు రోజులు గ్యాడ్యుయేట్స్‌కు అవగాహన కల్పించి ప్రత్యేకంగా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

3న భవనం తొలగింపునకు వేలం పాటలు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో శిథిలమైన భవనాలను తొలగించేందుకు జూన్ 3న వేలం పాటలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రజని తెలిపారు. ప్రిన్సిపాల్, ఇద్దరు సిబ్బంది నివాసాలు, వంటగది, స్టోర్ గదులు తొలగించాల్సి ఉందని తెలిపారు. దీనికోసం జూన్ 3వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కల వారు రూ.10 వేలు ధరావతు, రూ.3 వేల ప్రవేశ రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. డీడీలను పాఠశాలలో 2వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని సూచించారు. వివరాలకు 8712625049 లో సంప్రదించాలని తెలిపారు.

రికవరీలు వంద శాతం చేపట్టాలి


మాట్లాడుతున్న ఏజీఎం కామాక్షయ్య.

సైదాపురం : ఆర్థిక సంవత్సరంలో ఎల్‌హెచ్ టార్గెట్‌ను ప్రతి వీవోఏ రికవరీలను వంద శాతం పూర్తి చేయాలని ఏజీఎం కామాక్షయ్య తెలిపారు. ఆయన శుక్రవారం సైదాపురంలో వీవోఏఎస్‌లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి లోన్స్, రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం, సీసీలు, స్త్రీనిధి మేనేజర్ పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన


పంగిలిలో అవగాహన కల్పిస్తున్న రాజ్యలక్ష్మి

రాపూరు : మండలంలోని చెల్లటూరు, పంగిలి అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోరి వికాసంపై బాలికలు, తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, సౌజన్య మాట్లాడుతూ కిశోర బాలికలు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



సైదాపురం : ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సైదాపురంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తోందన్నారు. ఈ క్రమంలో భారత ఆర్మీ ఉగ్రవాద శిబిరాలను నాశనం చేసిందని తెలిపారు. మన సైనికులకు సంఘీభావం తెలుపుతూ ర్యాలీ చేసినట్టు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు సరస్వతి, జిల్లా సెక్రటరీ జాన్‌బాషా పాల్గొన్నారు.

మార్జిన్ లోపలే వ్యాపారాలు

వెంకటగిరి (సైదాపురం) : రోడ్డు మార్జిన్ దాటకుండా వ్యాపారాలు చేసుకోవాలని వెంకటగిరి సీఐ ఏవీ రమణ సూచించారు. పట్టణంలోని పలుచోట్ల రోడ్డు మార్జిన్‌ను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణం విస్తరిస్తున్న తరుణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోందన్నారు. ఈ క్రమంలో తాము నిర్దేశించిన మార్కింగ్‌కు లోపలే వ్యాపారులు విక్రయాలు చేసుకోవాలని తెలిపారు. రోడ్డులోకి వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వివరించారు. ఎస్ఐ సుబ్బారావు, ఏఎస్ఐ బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

దొరకని పశుగ్రాసం

ఓజిలి మండలంలోని మారుమూల గ్రామాల్లో ఎన్నడూ లేని విధంగా దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. మాగాణి భూములు బీళ్లుగా మారాయి. దీంతో గడ్డి దొరక్క మూగజీవాలు అల్లాడుతున్నాయి. మేత కోసం మైళ్ల దూరం వెళ్లినా ఫలితం లేదని కాపరులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితి మునుపెన్నడూ లేదని, ఈ ఏడాది మూగజీవాలను ఎలా కాపాడుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- బీడు భూములుగా మారిన పంటపొలాలు
- తాగునీటి కోసం అలమటిస్తున్న వైనం
- అల్లాడుతున్న మూగజీవాలు


నెమళ్లపూడిలో మేత దొరక్క అల్లాడుతున్న గొర్రెలు


వరి గడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న రైతులు

ఓజిలి : మండలంలో గేదెలు 15 వేలు, గొర్రెలు, మేకలు 50 వేలు, ఆవులు 3 వేల వరకు ఉన్నాయి. పశువులకు తాగునీరు, మేత దొరక్క అల్లాడుతున్నాయి. వర్షం ముఖం చాటేయడంతో పచ్చగా ఉండాల్సిన భూములు బీళ్లను తలపిస్తున్నాయి. ఎండలు మండుతుండడంతో కనుచూపు మేరలో పచ్చని మొక్కలు కనించడం లేదు. దీంతో మేతలేక పాల దిగుబడి తగ్గిపోతోందని రైతులు వాపోతున్నారు. దూరప్రాంతం నుంచి గడ్డి కొనుగోలు చేద్దామనుకుంటే ధరలు భగ్గుమంటున్నాయి. ఎకరాలోని వరి గడ్డి ధర రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు పలుకుతోంది. దాణా ధరలు రెట్టింపు కావడంతో పశువులను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు. దీనికితోడు చెరువుల్లో నీరు అడుగంటుతోంది. తాగేందుకు నీరు దొరక్కపోవడంతో పశువులకు తిప్పలు తప్పడం లేదు. పంట కాలువల్లో సైతం నీరు లేకపోవడంతో మధ్యాహ్నం సమయంలో మూగజీవులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నాయి. మానవమాల, కొండవల్లిపాడు, బువనగిరిపాళెం, రావిపాడు, కొత్తచెరువు, పున్నేపల్లి, జోష్యులవారికండిగ తదితర చెరువులు ఎండిపోయి భూమి నెర్రెలు బారింది.

పాడిరైతులు గడ్డిని పెంచుకోవాలి

మండలంలోని పాడి రైతులు గడ్డిని పెంచుకోవాలని పశుసంవర్థకశాఖ అధికారులు చెబుతున్నారు. 10 నుంచి 50 సెంట్ల భూమి ఉంటే గడ్డిని పెంచుకునేందుకు ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు తదితరాలకు రూ.32 వేలు అందజేస్తుందని తెలిపారు. మండలంలో 200 యూనిట్ల వరకు రైతులు గడ్డిని పెంచుకునేందుకు అనుమతులు ఉన్నాయని చెబుతున్నారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నామని వెల్లడించారు.

మేత కోసం దూరపు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది



మూగజీవాలకు స్థానికంగా మేత దొరకడం లేదు. మేత కోసం దూరంగా అటవీ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వరిగడ్డి దొరకడం లేదు. పంటలు సరిగా పండలేదు. ప్రభుత్వం పశుగ్రాసం సరఫరా చేయాలి.

- రామ్మోహన్, వీర్లగునపాడు

ఉపాధిలో గడ్డిని పెంచుకోవాలి



ఎండలు తీవ్రంగా ఉన్నాయి. వర్షాలు లేకపోవడంతో మూగజీవులు మేత దొరక్క ఆకలితో అలమటిస్తున్నాయి. పాడి రైతులు ఉపాధి హామీ కింద గడ్డిని పెంచుకోవాలి. ప్రభుత్వం పూర్తిగా ఖర్చులు భరిస్తుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- గౌతమ్ పశువైద్యాధికారి, ఓజిలి

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం


పూజలు చేస్తున్న సత్యనారాయణరెడ్డి దంపతులు

పెళ్లకూరు : మండలంలోని చిల్లకూరులో నిర్మించిన చెంచమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. హోమం చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ప్రభావతమ్మ దంపతులు, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, శ్రీదేవి దంపతులు, జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, వెంకటేశ్వర్లు దంపతులు హోమంలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, నాయకులు పెళ్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి, గ్రామస్తులు ప్రశాంత్, గోపాల్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

వనసంరక్షణ సమితి సభ్యుల నిరసన



వెంకటగిరి రూరల్ : వన సంరక్షణ సమితి సభ్యులకు నగదును వెంటనే చెల్లించాలని వన సంరక్షణ సమితి జిల్లా కార్యదర్శి పల్లిపాటి బాలకృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం సమితి సభ్యులతో కలిసి వెంకటగిరి పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి సంబంధించి 32 సొసైటీల ఆధ్వర్యంలో జామాయిల్ చెట్లను నరికి కొయ్యలను అటవీశాఖ కార్యాలయానికి భద్రంగా చేర్చినట్టు తెలిపారు. ఇందుకు గాను ప్రభుత్వం రూ.4.5 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులు వనసంరక్షణ సమితికి విడుదల చేయడంలో ఫారెస్ట్ రేంజర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆటోలు.. తోపుడు బండ్లకే నీడ!


షామియానాలో ఉన్న ఆటోలు, తోపుడు బండ్లు

చిల్లకూరు : వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గూడూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై పలు ప్రాంతాల్లో షామియానాలు వేసి పాదచారులకు నీడ కల్పిస్తున్నారు. ఆలోచన బాగానే ఉన్నా ఆచరణలో లక్ష్యం నీరుగారుతోంది. రద్దీగా ఉండే మార్కెట్టు సెంటర్‌లో రెండు, పాత బస్టాండ్ ప్రాంతంలో ఒక చోట షామియానా ఏర్పాటుచేశారు. వాటి కింద ఆటోలు, తోపుడు బండ్లను నిలుపుతుండడంతో ప్రయాణికులు, పాదచారులు ఉండడానికి అవకాశం లేకుండా పోతోంది. షామియానాలను ప్రజలు వినియోగించుకునేలా మున్సిపాలిటీ అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై రైల్వేశాఖ మంత్రికి లేఖ


మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవంలో అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా పట్టణ ప్రథమ పౌరుడినైన తనను అవమానించారని మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఆరోపించారు. ఆయన శుక్రవారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు లేఖ రాశారు. అమృత్ పథకం కింద అభివృద్ధి చేసిన రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించి ప్రొటోకాల్ పాటించకుండా అవమానించారని పేర్కొన్నారు. ఏపీ మున్సిపల్ చట్టం 1965 ప్రకారం మున్సిపాలిటీ పాలక వర్గం, ప్రజా ప్రతినిధులకు అధికారిక కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఉందని తెలిపారు. రైల్వే అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. దీనిపై దక్షిణ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు తగిన వివరణ ఇవ్వాలని, భవిష్యత్తులో అధికారిక కార్యక్రమాల్లో మున్సిపల్ ప్రజా ప్రతినిధుల విషయంలో ప్రొటోకాల్ పాటించేలా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. అలాగే అధికారికంగా మున్సిపాలిటీ పాలకవర్గానికి క్షమాపణ తెలియజేయాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు


పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన డీఎల్‌పీవో

చిట్టమూరు: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గూడూరు డీఎల్‌పీవో వెంకటరమణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ చిట్టమూరు ప్రభుత్వ కార్యాలయాల పక్కనే ఉన్న గుంతలో గుర్రపు డెక్క అల్లుకుని ఉందని స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. వెంటనే దాన్ని తొలగించాలని ఆదేశించారు. మండలంలో స్వర్ణ పంచాయతీ, ఆధార్ సీడింగ్, పన్నుల వసూళ్లు, సేల్స్ ప్రొసీడింగ్స్ తదితర విషయాలపై ఆరా తీశారు. ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఈవోపీఆర్డీ జనార్దన్, డీఆర్పీ రవి తదితరులు పాల్గొన్నారు.

● ట్రాఫిక్ పద్మవ్యూహం


కూరగాయల మార్కెట్టు సెంటర్‌లో అడ్డ దిడ్డంగా నిలిచిన వాహనాలు

గూడూరు పట్టణంలో రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడళ్లలో ఆటో డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో వెనుక వచ్చే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్, మార్కెట్టు సెంటర్, సంగం థియేటర్ ప్రాంతంలో ప్రతిరోజూ వాహనాలు స్తంభిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఉన్నప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. శుక్రవారం మార్కెట్టు సెంటర్‌లో ఆటోలు అడ్డదిడంగా నడపడంతో సుమారు 20 నిమిషాల పాటు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణపై పూర్తి స్థాయి దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

– చిల్లకూరు

దుగరాజపట్నం నౌకా నిర్మాణం వద్దు

- అమరావతి నిర్మాణం సక్సెస్ కాదు
- రాజధాని విషయంలో చంద్రబాబు తప్పు చేస్తున్నాడు
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్


ధర్నా చేస్తున్న చింతా మోహన్, కాంగ్రెస్ నాయకులు

గూడూరు రూరల్ : వాకాడు సముద్ర తీరప్రాంతంలోని దుగరాజపట్నం వద్ద నౌకా నిర్మాణం వద్దని, మేజర్ పోర్టు నిర్మించాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు చింతా మోహన్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద ధర్నా చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే 5వ అతిపెద్ద దుగరాజపట్నం మేజర్ పోర్టును ఆ నాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం దాన్ని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు రద్దు చేసి నౌకల నిర్మాణ కేంద్రం నిర్మించాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. దుగరాజపట్నం పోర్టు పూర్తయితే వందల సంఖ్యలో పరిశ్రమలు రావడంతోపాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. రాజధాని విషయంలో చంద్రబాబు తప్పు చేస్తున్నారని దుయ్యబట్టారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో రూ.లక్ష కోట్లతో రాజధాని నిర్మిస్తున్నారని తెలిపారు. సెక్రటేరియట్ కోసం 50 అంతస్తుల భవనాన్ని కట్టాలనుకుంటున్నారని, భవిష్యత్తులో అది కూలిపోతే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. శివరామకృష్ణన్ కమిటీ అమరావతిలో రాజధాని నిర్మించాలని చెప్పలేదన్నారు. 2029 నాటికి పేదరికాన్ని పారదోలుతానని చంద్రబాబు అంటున్నాడని, 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఏమి చేశారో చెప్పాలని నిలదీశారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, వెంకటయ్య, చందనమూడి శివ, పెంచలయ్య, పూల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఎమ్మెల్సీ పుట్టిన రోజు వేడుకలు


కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

చిల్లకూరు :స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం గూడూరులోని సనత్‌నగర్‌లో ఉన్న ఆయన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సుభాన్, పూర్ణచంద్ర, జలీల్, రూపేష్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాసులు, జయరామయ్య, మధురెడ్డి, ప్రేమ్, శైలేష్‌బాబు, జగదీష్, మార్క్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

హుండీ లెక్కింపుపై అనుమానాలు


కానుకలను లెక్కిస్తున్న టీడీపీ నేతలు

తడ: మండలంలోని వేనాడులో వున్న షేక్ దావూద్ షావలీ అల్లాహ్ దర్గాలోని హుండీలో భక్తులు సమర్పించిన కానులను శుక్రవారం లెక్కించారు. దీనిపై అధికారులు, గ్రామపెద్దలకు సమాచారం ఇవ్వకపోవడంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల సమయానికి హుండీ నిండింది. ఆ సమయంలో లెక్కింపుపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో హుండీకి సీల్ వేసి ఎన్నికలయ్యాక లెక్కింపు జరిపేలా అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఉత్తర్వులతో ఎంపీడీవోకు సమాచారం ఇవ్వకుండా, గ్రామస్తుల ప్రమేయం లేకుండానే టీడీపీ నాయకులు శుక్రవారం లెక్కింపునకు ఉపక్రమించారు. పెద్ద నోట్లను లెక్కించారు. పొద్దు పోయిందనే సాకుతో మిగిలిన చిల్లరను హుండీలో వేసి తాళాలు వేశారు. 20 నెలలుగా లెక్కింపు చేయకపోవడం వల్ల హుండీలో సుమారు రూ.30 లక్షల వరకు ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. రూ.13.41 లక్షలు ఉన్నట్టు లెక్క కట్టి బ్యాంకులో జమ చేశారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో శేఖర్ నాయక్ హుటాహుటిన గ్రామానికి చేరుకుని లెక్కింపును పర్యవేక్షించారు. అప్పటికే పెద్ద మొత్తంలో నగదు బయటకు వెళ్లిపోయినట్టు గ్రామంలో చర్చ జరుగుతోంది.


రసీదు

26 నుంచి ఆధార్ క్యాంపులు

చిల్లకూరు : మండలంలో ఈ నెల 26వ తేదీ నుంచి గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో గోపి తెలిపారు. ఆయన శుక్రవారం ఉపాధి ఏపీవో గిరిబాబు, ఎంఈవో రవూఫ్‌తో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 26న తూర్పుకనుపూరు, 27న చింతవరం, 28న కడివేడు, 29న తిక్కవరం, జూన్ 3న ముత్యాలపాడు, 4న వరగలిలో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు తెలిపారు. గిరిజనులు తప్పనిసరిగా ఆధార్ కార్డులు తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పాఠశాలల్లో యోగా నేర్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

రాజమునీశ్వర స్వామి ఉత్సవాలు ప్రారంభం



చిట్టమూరు : మండలంలోని ఎల్లూరు గ్రామంలో రాజమునీశ్వర స్వామి, నాగార్పమ్మ వార్షిక ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. దీక్ష వస్త్రధారణ, కంకణధారణ, అఖండ దీపస్థాపన, అభిషేకాలు చేశారు. అనంతరం గ్రామదేవత నాగార్పమ్మకు పుట్ట బంగారంతో అభిషేకం చేసి గాజుల అలంకరణ చేశారు. మధ్యాహ్నం గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు.

ఉపాధి పనుల అవకతవకలపై విచారణ జరపాలి

కోట : కొత్తపట్నం పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో అవకతవకలపై విచారణ జరపాలని సర్పంచ్ తిరుపాలయ్య కోరారు. ఆయన శుక్రవారం ఎంపీడీవో దిలీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది గతంలో చేసిన పనులనే మళ్లీ చేయిస్తున్నారని ఆరోపించారు. గ్రామసభ నిర్వహించకుండానే పనులు చేస్తున్నట్టు తెలిపారు. మస్టర్ల నమోదులోను అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

ఆధార్ సీడింగ్ తప్పనిసరి

గూడూరు రూరల్ : సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం బ్యాంకు ఖాతాకు ఆధార్ నంబర్ అనుసంధానం తప్పనిసరని తపాలా శాఖ గూడూరు డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎండీ జాఫర్ సాదిక్ తెలిపారు. ఆయన శుక్రవారం గూడూరులోని ప్రధాన తపాలా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల నగదు బ్యాంకు ఖాతాకు జమ చేసేందుకు ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్‌కు బ్యాంకు అకౌంట్ మ్యాపింగ్ చేయాల్సి ఉందన్నారు. లబ్ధిదారుల్లో చాలా మందికి ఆధార్ అనుసంధానం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే పోస్టల్ శాఖ, సచివాలయ సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జూన్ 5వ తేదీలోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తోపాటు ఎన్‌పీసీఐ లింకేజీ చేస్తూ ఖాతాలను ఓపెన్ చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఐ లింకేజీ కానివారు పోస్టాఫీసులకు వెళ్లి తప్పనిసరిగా చేసుకోవాలని కోరారు.

ఇళ్లు మంజూరు చేయాలని వినతి

నాయుడుపేట టౌన్ : అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేయాలని బీజేపీ నేతలు ఆశా చెంచుకృష్ణయ్య, బి.విజయభాస్కర్ కోరారు. వారు శుక్రవారం హౌసింగ్ ఏఈ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నాయుడుపేట పట్టణంతో పాటు మండలంలో పలువురు పేదలకు ఇళ్లు మంజూరు కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఏఈ మాట్లాడుతూ నాయుడుపేట పట్టణంలో పక్కా గృహాల కోసం 258 మంది, మండలంలో 1,319 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీటిపై ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతామని పేర్కొన్నారు. న్యాయవాది శ్రీనివాసులు, కొప్పోలు సుబ్రహ్మణ్యం, పి.రవి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

మిర్చి రైతుల గుండెల్లో గుబులు



ఓజిలి: నాలుగు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం, అప్పుడప్పుడు వర్షాలు కురుస్తుండడంతో మిర్చి రైతుల గుండెల్లో గుబులు పట్టుకుంది. మండలంలో ఎక్కువ మంది మిర్చి సాగు చేసిన రైతులు ప్రస్తుతం కాయలను కల్లాల్లో ఆరబెట్టారు. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో కాయలను విక్రయించడం లేదు. ఈ క్రమంలో వాతావరణ పరిస్థితులు మారుతుండడంతో ఏమి చేయాలో దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు. వర్షాలు కురిస్తే కాయలు తడిసిపోయి పాడవుతాయని ఆందోళన చెందుతున్నారు.

జనసేన సభ్యత్వం కిట్ల పంపిణీ

నాయుడుపేట టౌన్ : సూళ్లూరుపేట నియోజవర్గ జనసేన పార్టీ నాలుగో క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీని శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. నాయకులు అట్ల కృష్ణారావు, గిండి సతీష్, బాలుశెట్టి, బి.కిరణ్, కోటి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

చిట్టమూరు: వాకాడు మండలం రావిగుంటపాళెం గ్రామానికి చెందిన విద్యార్థి భువన్ ఉన్నత చదువులకు నాయుడుపేటకు చెందిన పాపాడి సందీప్‌రెడ్డి రూ.5 వేలు సాయం చేసినట్టు టీఎమ్మార్ కళాశాల ప్రిన్సిపాల్ రహంతుల్లా తెలిపారు. ఆయన మాట్లాడుతూ భువన్‌ను అతని తల్లి కష్టపడి చదివిస్తోందన్నారు. బాలుడికి 5వ తరగతి నుంచి దాతల సహకారంతో ఆర్థిక సాయం చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం భువన్ ఎంసెట్‌కు ప్రిపేర్ అవుతున్నాడన్నారు.

నిరుపయోగంగా సచివాలయ భవనం


మంగళంపాడు వద్ద ఉన్న సచివాలయ భవనం

సూళ్లూరుపేట రూరల్ : ప్రజలకు స్థానికంగా సేవలు అందేలా జగన్ ప్రభుతం సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చింది. సూళ్లూరుపేట మండలంలోని కోటపోలూరు, కోటపోలూరు–2, ఆబాక, కటడ పట్ర, మంగళంపాడు, కేసీఎస్‌గుంట, మంగానెల్లూ రు, దామానెల్లూరులో భవనాల నిర్మాణానికి రూ. 3.15 కోట్లు, అదనంగా మరో రూ.10.8 లక్షలు మంజూరు చేసింది. మంగానెల్లూరు, కోటపోలూరు–2, ఆబాక, మంగళంపాడు భవనాలు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం మంగళంపాడు సచివాలయాన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా మారింది.